క్లుప్తంగా

మాజీ ఎంపీటీసీకి పరామర్శ



పుల్లన్నను పరామర్శిస్తున్న జెడ్పీచైర్మన్ పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: పెట్నికోట సర్పంచ్ మదార్‌బీ భర్త, మాజీ ఎంపీటీసీ సభ్యుడు దూదేకుల పుల్లన్నను శనివారం జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పరామర్శించారు. కొద్ది రోజుల నుంచి ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ప్రస్తుతం కొలిమిగుండ్లలో ఉంటున్నారు. చైర్మన్ ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ప్రారంభానికి నోచుకోని ల్యాబ్ భవనం



నిరుపయోగంగా ల్యాబ్

ప్యాపిలి: స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో నూతనంగా నిర్మించిన ల్యాబ్ భవనం ప్రారంభానికి నోచుకోలేదు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో రూ. 35 లక్షలతో ఈ భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. భవన నిర్మాణ పనులు ఏడాది క్రితం పూర్తయినా ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఈ భవనాన్ని ప్రారంభిస్తే వివిధ రకాల పరీక్షలన్నీ ఇక్కడే నిర్వహించడంతో పాటు హాస్పిటల్‌కు ల్యాబ్ టెక్నీషియన్‌తో పాటు మరికొన్ని పోస్టులు కూడా అదనంగా వచ్చే అవకాశం ఉంది. అధికారులు స్పందించి భవనాన్ని త్వరగా ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

శ్రీసుధ విద్యార్థికి పురస్కారం



కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న విజయదుర్గ ప్రసాద్

డోన్ టౌన్: ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాల్లో 597 మార్కులు సాధించిన డోన్ ఇందిరానగర్‌కు చెందిన శ్రీసుధ విద్యార్థి విజయదుర్గ ప్రసాద్ శనివారం కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నాడు. శనివారం నంద్యాలలో జరిగిన అభినందన సభలో కలెక్టర్ రాజకుమారి అవార్డు అందజేసి అభినందించారు. ఇందిరానగర్‌కు చెందిన జ్ఞానశేఖర్, నాగరాణి దంపతుల కుమారుడు విజయదుర్గ ప్రసాద్‌తో పాటు శ్రీసుధ పాఠశాలలకు చెందిన 109 మంది విద్యార్థులు 500 మార్కులపైగా సాధించి ప్రతిభ చాటారు. విద్యార్థిని శ్రీసుధ ఎడ్యుకేషనల్ సొసైటీ యజమాన్యం సుదర్శన్, వేణుగోపాల్, రాజా సుధాకర్‌గుప్త, సూర్యనారాయణ అభినందించారు.

పన్నులు చెల్లిస్తేనే చెత్తబుట్టలు



గ్రామ సచివాలయంలోని మెట్ల కింద పడేసిన చెత్తబుట్టలు

డోన్ రూరల్: ఎక్కడ పడితే అక్కడ చెత్త పడేయకూడదని.. తడి, పొడి చెత్త వేరుచేసి ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రతి ఇంటికీ ప్రభుత్వం చెత్త బుట్టలను పంపిణీ చేస్తోంది. అయితే మండల పరిధిలోని కొచ్చెర్వులో మాత్రం ఇందుకు విరుద్ధంగా జరుగుతోంది. ఇంటి పన్నులు చెల్లిస్తేనే చెత్త బుట్టలు ఇస్తామని పంచాయతీ కార్యదర్శి బి.రంగస్వామి తెగేసి చెబుతుండడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెత్త బుట్టలు ఇవ్వకుండా సచివాలయంలోని మెట్ల కింద పడేశారని ఆరోపించారు. చెత్త నిర్వహణ, పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టకుండా సొంత నిర్ణయాలతో ఇబ్బందులకు గురిచేయడం ఎంత వరకు సబబని ప్రశ్నిస్తున్నారు.

బైక్‌పై నుంచి పడి ఇద్దరికి గాయాలు

రుద్రవరం: మండల పరిధిలోని రెడ్డిపల్లె గ్రామ సమీపంలో శనివారం మోటార్ సైకిల్ మీద నుంచి కింద పడి ఇద్దరు గాయపడ్డారు. నంద్యాలకు చెందిన మనోజ్, మరో వ్యక్తితో కలిసి మోటార్ సైకిల్‌పై అహోబిలం వెళ్లి తిరిగి వస్తుండగా రెడ్డిపల్లె సమీపంలో కుక్కలు అడ్డు రావడంతో వాటిని తప్పించే క్రమంలో అదుపు తప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు.

స్థానికులు వారిని రుద్రవరంలోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లి ప్రథమ చికిత్సలు చేసిన అనంతరం మెరుగైన చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

బాలుడి మృతిపై ఆందోళన

- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రోడ్డుపై బైఠాయింపు
- అధికారుల హామీతో విరమణ
- బాధిత కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన



బాధితులతో మాట్లాడుతున్న నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, కమిషనర్, తహసీల్దార్, సీఐ

బేతంచెర్ల: వీధి కుక్కల దాడిలో మృతిచెందిన బాలుడు షేక్ మొహిద్దీన్ మృతికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బంధువులు, హనుమాన్‌నగర్ కాలనీవాసులు, ముస్లింలు శనివారం నగర పంచాయతీ కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. కాలనీలో వీధి కుక్కలు ఎక్కువగా ఉన్నాయని గతంలో నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్‌కు విన్నవించినా పట్టించుకోకపోవడంతోనే ఈ దుర్ఘటన జరిగిందని కాలనీవాసులు, మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కుక్కలను పట్టుకోవడానికి వచ్చిన సిబ్బందిని అడ్డుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఉద్యోగి రాజారావుపై చర్యలు తీసుకునేంత వరకు ఆందోళన విరమించేదిలేదని తేల్చిచెప్పారు. దీనిపై నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్, చైర్మన్ చలంరెడ్డి మాట్లాడుతూ.. గతంలో రెండు సార్లు లక్షలు వెచ్చించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకున్నామని.. అయితే పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి రాజారావు అనిమల్ యాక్ట్ కింద కోర్టు నుంచి నోటీసులు పంపడంతో చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఆందోళనతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్, చైర్మన్ చలంరెడ్డి, సీఐ వెంకటేశ్వరరావు సంఘటనా స్థలానికి వెళ్లి బాధితులకు నచ్చజెప్పినా ససేమిరా అన్నారు. చివరకు పట్టణంలో వీధి కుక్కల నిర్మూలనకు సోమవారం నుంచే చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడమే కాకుండా రాజారావుపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి శాఖపరమైన చర్యలు తీసుకుంటామని, వీధి కుక్కలను దూర ప్రాంతాలకు తరలిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఎక్స్‌గ్రేషియా ప్రకటన

బాలుడి కుటుంబానికి అధికారులు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. శనివారం మండల ప్రత్యేక అధికారి షేక్ బషీరున్నీసా బేగం, నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ తదితరులు బాలుడి మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి నగర పంచాయతీ తరఫున రూ. 2 లక్షలు, జిల్లా కలెక్టర్ రూ.3 లక్షలు కలుపుకుని మొత్తం రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. త్వరలో బాధిత కుటుంబానికి అందజేస్తామని వెల్లడించారు. తక్షణ సాయం కింద రూ. 50 వేలు అందజేశారు.

ఎంపీడీఓ కార్యాలయ నిర్మాణానికి భూమి పూజ



భూమిపూజ చేస్తున్న మంత్రి బీసీ

కోవెలకుంట్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయం నూతన భవన నిర్మాణానికి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శనివారం భూమి పూజ చేశారు. ప్రస్తుతం ఉన్న 50 ఏళ్ల క్రితం నాటి కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో భవనాన్ని కూల్చి వేసి ఆ స్థానంలో కొత్త భవన నిర్మాణానికి రూ. 1.50 కోట్లు నిధులు మంజూరయ్యాయి. అనంతరం పట్టణ శివారులోని కుందూనది ఒడ్డున ఉన్న సీపీడబ్ల్యూఎస్ ఫిల్టర్ బావులను పరిశీలించి నీటి సరఫరాపై ఆరా తీశారు. అలాగే స్థానిక బనగానపల్లె సర్కిల్, వాల్మీకి నగర్ ప్రాంతాల్లో డ్రైనేజీని పరిశీలించారు. కాలువలు చెత్తా, చెదారంతో నిండి ఉండడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు గోపిరెడ్డి వెంకటలక్ష్మమ్మ, సర్పంచ్ మెట్ల సరళ, పంచాయతీరాజ్ డీఈ నాగ శ్రీనివాసులు, ఎంపీడీఓ వరప్రసాదరావు, తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి, ఈఓపీఆర్డీ ప్రకాష్ నాయుడు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి భూమి పూజ

బనగానపల్లె రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్ష అభియాన్ కింద రూ.4 కోట్లతో మౌలిక వసతులు, నూతన భవన నిర్మాణం కోసం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శనివారం భూమి పూజ చేశారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.లలిత, సర్పంచ్ ఈసారి ఎల్లమ్మ, ఎంపీడీఓ వెంకటరమణ పాల్గొన్నారు.

అనంతరం యాగంటిపల్లె గ్రామంలో చౌడేశ్వరిదేవి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో మంత్రి దంపతులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.

మంత్రి బీసీకి సీహెచ్‌ఓల వినతి

ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని.. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ మిడ్‌లెవల్ హెల్త్‌ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అసోసియేషన్ జిల్లా కో–ఆర్డినేటర్ సురేష్ బాబు, శ్రీనివాసులు, సెక్రటరీ గురుప్రసాద్, వెంకటభార్గవ్, వినోద్, హాజీవలి, హారిక పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వృద్ధుడికి గాయాలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– బనగానపల్లె ఆర్‌అండ్‌బీ రహదారిలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు.. మండలంలోని సౌదరదిన్నెకు చెందిన దస్తగిరి తెల్లవారుజామున టీ తాగేందుకు కోవెలకుంట్లకు వచ్చాడు. తిరిగి ఇంటికి నడుచుకుంటూ వెళుతుండగా పట్టణ శివారులోని డిగ్రీ కళాశాల సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. రోడ్డు ప్రమాద ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో సర్వేయర్‌కు గాయాలు

కొలిమిగుండ్ల: మహిళా సర్వేయర్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. అంకిరెడ్డిపల్లె సచివాలయ పరిధిలో ఆదిలక్ష్మి సర్వేయర్‌గా పనిచేస్తున్నారు. శుక్రవారం తుమ్మలపెంటలో భూముల రీసర్వే చేశారు. సాయంత్రం కొలిమిగుండ్ల తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి సర్వేకు సంబంధించి పనులు ముగించుకున్నారు. ఏడున్నర గంటలకు స్కూటర్‌పై తాడిపత్రికి బయలుదేరారు. ఎనిమిదిన్నర గంటల సమయంలో బుగ్గ దాటాక గద్దరగుట్టపల్లె వద్దకు చేరుకోగానే గాలులు వీయడంతో స్కూటర్ అదుపు తప్పి కింద పడింది. ఈ ప్రమాదంలో ఆమె కాలికి తీవ్ర గాయమైంది. స్థానికుల సాయంతో కుటుంబ సభ్యులు అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా సర్జరీ చేశారు.

గొడవలకు దూరంగా ఉంటే జీవితం ప్రశాంతం



నాయకులతో మాట్లాడుతున్న ఫ్యాక్షన్ జోన్ సీఐ ప్రభాకర్‌రెడ్డి

కొలిమిగుండ్ల: గ్రామాల్లో గొడవలకు పోకుండా అందరూ ప్రశాంతంగా ఉండాలని ఫ్యాక్షన్ జోన్ సీఐ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. శనివారం స్థానిక సీఐ రమేష్‌బాబుతో కలిసి పెట్నికోట, గొర్విమానుపల్లె, అంకిరెడ్డిపల్లె, చింతలాయిపల్లె తదితర గ్రామాల్లో పర్యటించారు. నాయకులు, ప్రజలతో సమావేశం నిర్వహించారు. గొడవలకు పాల్పడి కుటుంబాలను నాశనం చేసుకోవద్దన్నారు. పిల్లలను ఉన్నత చదువులు చదివించుకుని వారి ఉన్నతికి కృషి చేయాలని సూచించారు. చిన్న విషయాలకు అల్లర్లకు పాల్పడడం, ఘర్షణకు దిగడం చేయరాదని పేర్కొన్నారు. ఏవైనా సమస్యలుంటే పోలీస్ స్టేషన్‌లో పరిష్కరించుకోవాలన్నారు. గతంలో ఇక్కడ ఎస్‌ఐగా పని చేశానని.. పల్లెల్లో స్థితిగతులపై అవగాహన ఉందని తెలిపారు. గతంలో ఫ్యాక్షన్ ప్రభావం అధికంగా ఉండేదన్నారు. కాలక్రమేణా మార్పులు చోటు చేసుకున్నాయని తెలిపారు. పల్లెలపై పోలీసుల నిఘా ఉంటుందన్నారు. హెడ్‌కానిస్టేబుల్ స్వామి నాయక్ ఉన్నారు.

తిరునాలను దేవదాయశాఖ నిర్వహిస్తుంది

అవుకు: ఏటా అవుకులో జరిగే చెన్నకేశవస్వామి తిరుకల్యాణ మహోత్సవాలను ఈ ఏడాది దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆలయంలో రైతు సంఘం పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇది వరకు రైతు సంఘం ఆధ్వర్యంలో తిరునాల జరిగేదని, ఇక నుంచి రైతు సంఘం రూపాయి ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదన్నారు. మొత్తం దేవదాయశాఖ భరిస్తుందని తెలిపారు. త్వరలో తిరునాలకు సంబంధించి కమిటీ నియమిస్తామని చెప్పారు.

ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరణ చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

డోన్ రూరల్: పట్టణంలోని తారకరామనగర్ కాలనీలో ఏఐవైఎఫ్ 66వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివా రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి నారాయణ, పట్టణ కార్యదర్శి మోటారాముడు, పులిశేఖర్ హాజరై జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల కార్యదర్శులు జి.హరికృష్ణ, పృథ్వీకుమార్ పాల్గొన్నారు.

బేతంచెర్లలో..

బేతంచెర్ల: పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర నాయకులు భార్గవ్, మధు జెండాను ఆవిష్కరించారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్, నాయకులు ప్రదీప్‌సాయి, రాజు, విజయ్, నాగరాజు, మధుసూదన్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

వామ్మో.. ఇంత ఓవర్ లోడా..!



ఓవర్ లోడ్‌తో వెళ్తున్న నాపరాళ్ల ట్రాక్టర్

కొలిమిగుండ్ల: లారీలో తీసుకెళ్లాల్సిన లోడ్‌ను ట్రాక్టర్లలో తీసుకెళుతున్నారు. బెలుం సమీపంలోని నాపరాతి గనుల నుంచి ట్రాక్టర్‌లో రాళ్లను ట్రాలీ కంటే రెండింతల ఎత్తున పేర్చుకుని జమ్మలమడుగుకు తీసుకెళుతున్నారు. రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు, గుంతలు ఉన్న చోట రాళ్లు కింద పడే అవకాశాలు ఉంటాయి. రాకపోకలు సాగించే ఇతర వాహనదారులకు వీటి వల్ల ప్రమాదాలు చోటు చేసుకునే ప్రమాదం పొంచి ఉంది. లారీ మోసే బరువును ట్రాక్టర్‌లో తీసుకెళుతుండటంతో ప్రజలు ఇంత ఓవర్‌లోడా అని ఆశ్చర్యానికి గురవుతున్నారు.



దెబ్బతిన్న బస్టాండ్‌లోకి వెళ్లే రోడ్డు



నిల్వ చేరిన వర్షపునీరు

అధ్వానంగా ఆర్టీసీ బస్టాండ్ రోడ్లు

కోవెలకుంట్ల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లోకి వెళ్లే రోడ్లు పూర్తిస్థాయిలో దెబ్బతిన్నాయి. బస్టాండ్ ప్రాంగణం లోతట్టు ప్రాంతంలో ఉండడంతో చిన్నపాటి వర్షానికే నీరు నిల్వచేరుతోంది. రోజుల తరబడి నీరు నిలిచి ఉండడంతో బస్టాండ్‌లోకి బస్సులు వెళ్లే రోడ్డు, బస్సులు బయటకు వచ్చే రోడ్డు శిథిలావస్థకు చేరుకుని పెద్ద గుంతలతో దర్శనమిస్తున్నాయి. వాహన చోదకులు ఈ రోడ్లపై వాహనాలు నడిపేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలతో రోడ్లపై నీరు నిల్వ చేరుతుండడంతో బస్టాండ్‌లోకి వెళ్లే ద్విచక్ర వాహన చోదకులు కింద పడి ప్రమాదాలకు గురి అవుతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మహాకుంభాభిషేక వజ్రోత్సవాలకు వేళాయె

- నేటి నుంచి ఉత్సవాలు
- ఉత్సవాలకు హంపి, పెనుగొండ పీఠాధిపతులు



వజ్రోత్సవాలకు ముస్తాబైన వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయం

కోవెలకుంట్ల: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో మహాకుంభాభిషేక వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం నుంచి 8వ తేదీ వరకు ఐదు రోజులపాటు వజ్రోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. మొదటి రోజు ఆలయంలో గోపూజ, గణపతి పూజ, గంగాయనం, చండీ, లక్ష్మి, గణపతి, రుద్ర హోమాలు జరుగుతాయని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రమణ్యం తెలిపారు. అదే రోజు రాత్రి పెనుగొండ పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతీ(బాలస్వామిజీ) ఆధ్యాత్మిక ప్రవచనాలు, వారాహి అమ్మవారి ఊరేగింపు ఉంటుందన్నారు. 5వ తేదీ పార్వతీపరమేశ్వరుల కల్యాణం, గ్రామోత్సవం, 6న సీతారాముల కల్యాణం, గ్రామోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. 7న వాసవీకన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలు, గజగౌరిదేవి గ్రామోత్సవం, రాత్రికి హంపి పీఠాధిపతి విద్యారణ్యభారతి తీర్థ మహాస్వామి ఆధ్యాత్మిక ప్రసంగం ఏర్పాటు చేశామన్నారు. 8న హంపి పీఠాధిపతి ఆధ్వర్యంలో మహాకుంభాభిషేకం, మహా పూర్ణాహుతి, వాసవీమాత గ్రామోత్సవం ఉంటుందని వెల్లడించారు.

‘మర్రికి వెర్రి ముదిరింది’



మాట్లాడుతున్న మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ నాయకులు

- మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు

డోన్: రైల్వే కార్మికుల కుటుంబాలపై వడ్డీ, చక్రవడ్డీలు వసూలు చేసి కోట్లకు పడగెత్తిన టీడీపీ నాయకుడు మర్రి రమణకు వెర్రి బాగా ముదిరిందని వైఎస్సార్‌సీపీ నేత, మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. మాజీ మంత్రి బుగ్గనకు మద్యం కుంభకోణంలో సంబంధం ఉందని పదేపదే ప్రెస్‌మీట్‌లు పెట్టి ఆరోపించడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. కార్మికుల కష్టార్జితంతో కోట్లకు పడగలెత్తి వారి కడుపు కొట్టడమే కాకుండా వారి పిల్లల ఉసురు మర్రి రమణ కుటుంబానికి తగిలినందు వల్లే వెర్రి బాగా ముదిరి తలకు ఎక్కిందన్నారు.

ఎవరు రోడ్లు ఆక్రమించారో అందరికీ తెలుసు

పట్టణంలోని రోడ్డును ఆక్రమించింది ఎవరనేది పట్టణ ప్రజలందరికీ తెలుసునని శ్రీరాములు అన్నారు. థియేటర్ పక్కన, ఎదుట ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన నీకు నిజాయితీపరుడైన బుగ్గనను విమర్శించే స్థాయి ఎక్కడిదని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్మును బినామీ విద్యార్థుల పేర్లపై స్వాహా చేసిందెవరనేది కూడా విద్యార్థులకు తెలుసన్నారు.

అభివృద్ధిని అడ్డుకోవడమే మీ నైజం

ఆధునిక కూరగాయల మార్కెట్, ప్రభుత్వాస్పత్రి నిర్మాణాలు జరగకుండా కోర్టులకు వెళ్లి అడ్డుకున్నది మీరు కాదా అని నిలదీశారు. పేదలకు ప్రభుత్వాస్పత్రి, విద్యార్థులకు వసతిగృహాలు ఎందుకు అనే విధంగా మర్రి రమణ మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. విజిట్ల పేరుతో తరచూ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి అధికారులను బెదిరించడం, బ్లాక్‌మెయిల్ చేయడం ఆయనకు అలవాటేనన్నారు. మాజీ వార్డుమెంబర్ శ్రీరాములు ఆస్తిని కబ్జా చేసేందుకు అతనిపై దాడి చేసింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. జనసేనలో చేరి మున్సిపల్ చైర్మన్ టికెట్ దక్కించుకోవాలని రమణ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మరోసారి బుగ్గన గురించి మాట్లాడితే ఆయన అవినీతి, అనైతిక పనుల బండారాన్ని మొత్తం బయటపెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ అధ్యక్షులు సోమేష్ యాదవ్, మల్లికార్జునరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు కుమ్మరి రాజు, నాయకులు మల్యాల శ్రీనివాసరెడ్డి, జగదుర్తి మోహన్‌రెడ్డి, సుంకన్న పాల్గొన్నారు.

మునిస్వామికి నివాళి



మునిస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

డోన్ టౌన్: కార్మిక సమస్యలపై రాజీలేని పోరాటాలు చేసిన మహోన్నత వ్యక్తి కామ్రేడ్ మునిస్వామి అని న్యాయవాది నాగభూషణంరెడ్డి, సీపీఎం నాయకులు కొండన్న, డోన్ లారీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, శివరామ్ అన్నారు. శనివారం మునిస్వామి వర్ధంతి సందర్భంగా స్థానిక కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. అనంతరం యర్రగుంట్ల గ్రామానికి చెందిన లారీ కార్మికుల సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్మిక సంఘం నాయకులు లక్ష్మన్న, వెంకటరాముడు, సుబ్బారెడ్డి, రాజా, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఐస్ యాపిల్..!

- వేసవి తాపాన్ని తీర్చే తాటిముంజలు
- శరీరానికి ఆరోగ్యం, చల్లదనం



ప్యాపిలి సమీపంలో రోడ్డు పక్కన విక్రయిస్తున్న తాటి ముంజలు

ప్యాపిలి: వేసవిలో లభించే ఫలాల్లో తాటి ముంజలది ప్రత్యేక స్థానం. అన్ని ఫలాల మాదిరి కాకుండా భిన్నంగా కనిపించే ఈ ఫలాన్ని ఐస్ యాపిల్ అని కూడా పిలుస్తారు. పిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ తినేందుకు ఆసక్తి చూపే తాటి ముంజల్లో అనేక పోషక విలువలు ఉన్నాయి. ప్రస్తుత కాలంలో మామిడితో పాటు అనేక రకాల పండ్లు రసాయనాలతో పక్వానికి తెస్తున్నారు. ఇలాంటి పండ్లు తిని రోగాలు కొని తెచ్చుకుంటున్నారు. ఎలాంటి కల్తీ లేని ప్రకృతి వరప్రసాదినిగా తాటిముంజలను చెప్పుకోవచ్చు. సీజన్ కావడంతో వ్యాపారులు డజన్ తాటి ముంజలు రూ. 50 నుంచి రూ.70 వరకు విక్రయిస్తున్నారు.

ఆరోగ్యంతో పాటు చల్లదనం

తాటి ముంజలలో శరీరానికి కావాల్సిన పోషకాలు మెండుగా ఉన్నాయి. ప్రస్తుతం ఎండలు మండిపోతున్నాయి. దీంతో చెమటతో డీహైడ్రేషన్‌కు గురయ్యేవారు ముంజలు తినడం ద్వారా శరీరం త్వరగా హైడ్రేట్ అవుతుంది. వృత్తిరీత్యా ఎక్కువగా బయట గడిపేవారు సరిపోయేంత నీరు తాగని కారణంగా కిడ్నీలలో రాళ్లు ఏర్పడే ప్రమాదం ఉంది. ఈ సమస్య ఉన్నవారికి తాటి ముంజలు దివ్య ఔషధం.

శరీర బరువును నియంత్రించే ముంజలు

కడుపులో మంట, మూత్ర విసర్జన సమయంలో పొత్తి కడుపులో భరించలేని నొప్పితో బాధపడేవారు క్రమం తప్పకుండా ముంజలు తింటే మంచి ఫలితం ఉంటుంది. తాటి ముంజలలో శరీరానికి కావాల్సిన ఏబీసీ విటమిన్లు, ఐరన్, జింక్, ఫాస్పరస్, పొటాషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. తాటి ముంజలు శరీర బరువు తగ్గటానికి దోహదం చేస్తాయి.

నేడు గంగ జయంతి

బనగానపల్లె రూరల్: మండలంలోని పలుకూరు రామేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం గంగ జయంతి నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు భాస్కరయ్య శనివారం తెలిపారు. ఈ సందర్భంగా 108 కలశాలతో జలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు విజయవంతం చేయాలని కోరారు.